క్లుప్తంగా

వైద్యఖర్చుల కోసం ఆర్థికసాయం


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కోనప్ప

బెజ్జూర్: మండలానికి చెందిన విలేకరి దుర్గం దేవాజీ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బుధవారం వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని కుకుడ గ్రామంలోని దేవాజీ నివాసానికి చేరుకొని రూ.10వేలు అందజేశారు. కోఆప్షన్ సభ్యులు బషారత్ ఖాన్, ఎంపీటీసీ శ్రీను, ప్రాథమిక సహకార సంఘం మాజీ చైర్మన్ వెంకన్న, మాజీ వైస్‌చైర్మన్ ఇస్తారి, కాంగ్రెస్ నాయకులు సాకారం, జావిద్, రాజారామ్, పురుషోత్తం, అమీరుద్దీన్, రోహమత్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వం కల్యాణలక్ష్మిలో బంగారం కూడా ఇవ్వాలి’


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు బంగారం కూడా ఇవ్వాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని 66 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఎంపీపీ మల్లిఖార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, వాంకిడి జెడ్పీటీసీ అజయ్, సింగిల్‌విండో చైర్మన్ పెంటు, తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ పోచయ్య ఉన్నారు.

సమస్యల పరిష్కారం

వాంకిడి: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో ఎనిమిది మంది వినియోగదారుల సమస్యలు పరిష్కరించినట్లు ఏఈ శ్రీకాంత్ తెలిపారు. వినియోగదారుల నుంచి వచ్చిన దరఖాస్తులను సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ రామకృష్ణ, ఫైనాన్స్ మెంబర్ కిషన్ నేతృత్వంలో పరిశీలించినట్లు పేర్కొన్నారు.

ప్రపంచ సికిల్‌సెల్ దినోత్సవం

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ప్రపంచ సికిల్‌సెల్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. జూలై3 వరకు అవగాహన కా ర్యక్రమాలతో పాటు సికిల్‌సెల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యుడు ఉప్రె వినయ్ తెలి పారు. కార్యక్రమంలో హెచ్ఈవో రవిదాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో..

ఆసిఫాబాద్‌రూరల్: సికిల్‌సెల్ వ్యాధిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డీటీడీవో రమాదేవి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆశ్రమ బాలికల పాఠశాలలో సికిల్‌సెల్ అనీమియా ఎలిమినేషన్ దినోత్సవం నిర్వహించారు. జెడ్పీటీసీ నాగేశ్వర్ రావు, ఎంపీపీ మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షుడిగా సోమశేఖర్


నియామకపత్రం అందుకుంటున్న సోమశేఖర్

రెబ్బెన: మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని నంబాలకు చెందిన చెన్న సోమశేఖర్ నియమితులయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని మున్నూర్‌కాపు సంఘం రాష్ట్ర భవన్‌లో రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కొండ దేవయ్య చేతులమీదుగా నియామకపత్రం అందుకున్నారు.

భూసాధన పరిరక్షణ కమిటీ ఎన్నిక

బెజ్జూర్: మండలంలోని లంబడిగూడలో భూసాధన పరిరక్షణ కమిటీ ఎన్నికలు, రైతు భూసాధన పరిరక్షణ కమిటీ ఎన్నికలు జేఏసీ సోయం చిన్నయ్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. భూ సాధన పరిరక్షణ కమిటీ అధ్యక్షుడిగా జాడి దిగంబర్, గౌరవ అధ్యక్షుడిగా అల్లూరి మోహన్, ఉపాధ్యక్షులుగా బిక్షపాతి, ప్రధాన కార్యదర్శులుగా బ్రహ్మయ్య, లింగయ్యలను ఎన్నుకున్నారు. సభ్యులుగా జలుపతి, సుగుణాకర్, తిరుపతి, సత్తయ్య, జనార్దన్, పాపయ్య, సహాయ కార్యదర్శిగా రామయ్య, జోగయ్య, సోషల్ మీడియా కన్వీనర్‌గా ఉమ్మెర బాలకృష్ణలను ఎన్నుకున్నారు.

మృత్యు విద్యుత్..!

- విద్యుదాఘాతంతో ఏటా పలువురు మృత్యువాత
- వర్షాకాలంలో ప్రమాదాలకు అవకాశం
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



కౌటాల: జిల్లాలో తరుచూ జరుగుతున్న విద్యుత్ ప్రమాదాలతో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రైతులకు పాములు, విషపురుగులతో పాటు విద్యుత్‌తో సైతం పెనుప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ తీగలు యమపాశాలుగా మారే అవకాశం ఉంది. చేతికందే ఎత్తులో ఉన్న వైర్లు.. నిర్వహణ లోపంతో తరుచూ తెగిపడుతున్న లైన్లు ప్రజలకు షాకిస్తున్నాయి. దీంతో జనంతో పాటు మూగజీవాలు సైతం ప్రాణాలు కోల్పోతున్నాయి. జిల్లాలో ఈదురుగాలులు వీచిన సమయంలో పలుమార్లు విద్యుత్ తీగలు తెగిపడితే వెంటనే సంబంధిత సబ్‌స్టేషన్‌లోని ఫీడర్ ట్రిప్ పరిధిలోని ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. కానీ నిర్వహణ లోపంతో జిల్లాలోని పలు ఫీడర్లు ట్రిప్పవకపోగా యథావిధిగా విద్యుత్ సరఫరా జరుగుతుండడంతో పలుమార్లు మూగజీవాలతో పాటు అమాయక రైతులు సైతం విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాల సాక్షిగా స్థానిక ప్రజాప్రతినిధులు, బాధితులు కరెంట్ సమస్యలపై ఏకరువు పెట్టినా ఫలితం లేకుండా పోతోంది.

వేలాడుతున్న వైర్లతో ప్రమాదం..

జిల్లాలోని పలు గ్రామాల్లో చెట్ల కొమ్మల మధ్యన చేతికందే ఎత్తులో వేలాడుతున్న వైర్లు దర్శనమిస్తున్నాయి. లైన్ల పునరుద్ధరణ కోసం ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా సరఫరా వ్యవస్థ మెరుగు పడకపోగా మరింత ప్రమాదకరంగా తయారైంది. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యుత్ సరఫరాపై సరైన పర్యవేక్షణ కరువైంది. జిల్లాలోని ఆయా ఇళ్లల్లో సరైన విద్యుత్ వైరింగ్ లేకపోవడంతో తరుచూ చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. నాసిరకమైన వైర్లు చాలా ఇళ్లల్లో వేలాడుతూ ఉంటున్నాయి. ఇళ్లల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలపై పర్యవేక్షణ లేక సమీప రేకుల షెడ్లు, బట్టలు ఆరబెట్టే తీగలకు విద్యుత్ సరఫరా జరిగి పలుమార్లు మహిళలు మృత్యువాత పడుతున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పొలాల్లో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. జిల్లాలో 1.34 లక్షలకు పైగా గృహ విద్యుత్ కనెక్షన్లు, 13వేల వాణిజ్య, 600లకు పైగా పరిశ్రమలు, 12వేలకు పైగా వ్యవసాయ, కేటగిరి(6) 3వేల వరకు, కేటగిరి(7) 1200లకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అధి కారులు విద్యుత్ ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అవగాహన తప్పనిసరి..

- విద్యుత్ వినియోగం ప్రతీ ఇంట్లో.. ప్రతీ రంగంలోనూ ఉంది. అభివృద్ధి వెలుగులు పంచాల్సిన వి ద్యుత్తు కేవలం అవగాహన లోపం కారణంగా ప్రా ణాంతకంగా మారుతోంది. తీగలు, తడి ప్రదేశం త దితర మార్గాల ద్వారా ప్రసరించే గుణం ఉన్న వి ద్యుత్తు కారణంగా ఏటా ఎందరో ప్రాణాలు కో ల్పోతున్నారు. అవగాహన, అప్రమత్తతతో ఉంటే వీటి ని నివారించవచ్చని విద్యుత్ శాఖ అధికారులు చెబు తున్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.
- ఇళ్లల్లో పిల్లలకు అందనంత ఎత్తులో స్విచ్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలి.
- ఇంటి వైరింగ్‌కు తప్పనిసరిగా ఎర్తింగ్ ఏర్పాటు చేయాలి.
- వ్యవసాయ మోటరు సామర్థ్యానికి తగిన నాణ్యత గల తీగలు మాత్రమే వాడాలి.
- మోటర్‌కు తప్పనిసరిగా ఎర్తింగ్ ఉండాలి. తీగలు వదులుగా నేలమీద ఉంచరాదు.
- పంపుసెట్టు పాడైతే సొంతంగా మరమ్మతులు చేయడానికి పూనుకోవద్దు.
- తెగి కిందపడిన లేదా వేలాడుతున్న విద్యుత్ తీగలను తాకరాదు.
- తడి దుస్తులు, తడి చేతులతో విద్యుత్తు పరికరాలు తాకడం, స్విచ్‌లు వేయడం సరికాదు.
- విద్యుదాఘాతానికి గురైన వ్యక్తిని నేరుగా తాకరాదు. పొడికర్ర లేదా విద్యుత్ ప్రవహించని ప్లాస్టిక్ వస్తువులతో మాత్రమే ప్రమాదానికి గురైన వ్యక్తిని తప్పించాలి.

జిల్లాలో సంఘటనలు..

- గతేడాది జూలైలో పెంచికల్‌పేట్ మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన రైతు ఉష్ణబోయిన వెంకన్న పంటపొలంలో విద్యుత్ మోటర్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతంతో మృతి చెందాడు.
- గతేడాది జూలైలో రెబ్బెన మండలంలోని గొల్ల గూడకు చెందిన యువ రైతు రమాకాంత్ ఇంటి వద్ద విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు.
- గతేడాది జూలైలో కాగజ్‌నగర్ పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన తన్నీరు సుశీల ఇంట్లో కూలర్ ఆన్ చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది.
- గతేడాది బెజ్జూర్ మండలంలోని నాగుల్వాయి గ్రామానికి చెందిన మొర్లె బాపు పంట చేనులో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు.

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలోని రైతులు, ప్రజలు వర్షాకాలంలో విద్యుత్ వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఇళ్లల్లో విద్యుత్ తీగలు రేకులకు తాకకుండా చూసుకోవాలి. గ్రామాల్లో విద్యుత్ తీగలు వేలాడినా, తెగి పడినా వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. రైతులకు విద్యుత్ సమస్యలుంటే విద్యుత్‌శాఖ సిబ్బందిని సంప్రదించాలి. సొంతంగా మరమ్మతులు చేయరాదు. విద్యుత్ ప్రమాదాలపై విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నాం.

– రాజేశ్వర్, ఏఈడీ, కౌటాల

పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలి

రెబ్బెన: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని పులికుంట కాలనీ, రేకులగూడెం ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, మహేశ్ అన్నారు. ప్రతీరోజు లైబ్రరీ పీరియడ్‌లో విద్యార్థులు తమకు నచ్చిన కథల పుస్తకాలను చదువుకోవాలన్నారు. బుధవారం జాతీయ పఠన దినోత్సవం సందర్భంగా ఆయా పాఠశాలలో విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. రూం టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ అందించిన పుస్తకాల్లో ఆకర్షణీయంగా బొమ్మలు ఉంటాయని, పిల్లలను ఆలోచింప జేసేలా, సృజనాత్మకతను పెంచటంతో పాటు చుట్టూ ఉన్న పరిసరాల గురించి తెలుసుకునేలా ఉంటాయన్నారు. విద్యార్థులంతా పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకోవాలని సూచించారు.

లయన్స్‌క్లబ్ సేవలు విస్తరించాలి


నోట్ పుస్తకాలు అందజేస్తున్న రాజిరెడ్డి

రెబ్బెన: లయన్స్ క్లబ్ ఆఫ్ గోలేటి స్పోర్ట్స్ క్లబ్ సేవలను మరింత విస్తరించాలని 320జి జిల్లా గవర్నర్ లయన్ హనుమాన్ల రాజిరెడ్డి అన్నారు. బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ గోలేటి స్పోర్ట్స్ క్లబ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం సర్వీస్ యాక్టివిటీ కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలకు చెందిన 100 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. అనంతరం గవర్నర్‌ను క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. మాజీ గవర్నర్ నారాయణరెడ్డి, క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణ, జిల్లా క్యాబినెట్ కార్యదర్శి వెంకటరమణ, ఆర్‌సీ సుదర్శన్, జెడ్‌సీ రాజయ్య, డీజీ అఫీషియల్ విజిట్ నారాయణరావు క్లబ్ కార్యదర్శి అన్నం రమేష్, సభ్యులు మహేందర్‌రెడ్డి, భాస్కర్, చందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- ఫర్టిలైజర్ దుకాణాలు తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

తిర్యాణి: ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపులోని రికార్డులు, బిల్లులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన ప్రతీ దానికి తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. స్టాక్, కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. నిర్ణీత ధరల కన్న అధిక ధరలకు విక్రయిస్తే షాపు లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ అధికారులు క్రమం తప్పకుండా షాపులను తనిఖీ చేసి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు, ఏవో తిరుమలేశ్వర్, ఏఈవోలు శ్రవణ్, వినోద్, ముత్తయ్య తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న చంద్రశేఖర్

తిర్యాణి: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్ బుధవారం మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను కలిసి వినతిపత్రం అందజేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ త్రీ ఇన్‌క్లెయిన్ నుంచి మండల కేంద్రం వరకు బీటీ రోడ్డును మంజూరు చేసి నిర్మాణానికి అవసరమయ్యే ఫారెస్టుశాఖ అనుమతులు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల కేంద్రంలోని 30 పడకల ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించడంతో పాటుగా టెక్నీషియన్ లేక మూలకు చేరిన ఈసీజీ, ఎక్స్‌రే మిషన్‌లను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. జిల్లా కలెక్టర్ సమస్యలపై సానుకూలంగా స్పందించి మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

దహెగాంలో బొడ్రాయి బోనాలు


బోనాలతో మహిళలు

దహెగాం: మండల కేంద్రంలో బొడ్రాయి మహాలక్ష్మీ బోనాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బోనమెత్తిన మహిళలు, శివసత్తుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పుచప్పుళ్లతో గ్రామాల్లోని వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. స్థానిక పోచమ్మ ఆలయం వద్ద బోనాలతో ప్రదక్షిణలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి చల్లగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల పండుగకు ఎమ్మెల్సీ దండె విఠల్ హాజరై అమ్మవారికి పూజలు చేశారు.

గుంతలు పూడ్చారు

సాక్షి ఎఫెక్ట్..


గుంతలు పూడుస్తున్న సిబ్బంది

కెరమెరి: మండలంలోని సు ల్తాన్ గూ డ వంతెనపై గుంతలు పడి నడిచేందుకు కూడా యోగ్యంగా లేకపోవడంపై ‘సాక్షి’లో ‘గుంతల మ యం’ శీర్షికన ప్రచురితమైన ఫొటో స్టోరీకి స్పందన లభించింది. ధనోరా గ్రామ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ రిజ్వాన్ స్పందించి బుధవారం గుంతల్లో మొ రం పోయించి గుంతలు పూడ్చారు. ఝరి, ధనోరా ప్రధాన రోడ్డుకు ఉన్న గుంతలను సైతం పూడుస్తున్నట్లు రిజ్వాన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ముమ్మరంగా ‘భగీరథ’ సర్వే

- ఇప్పటికే 75శాతం పూర్తి
- ఇంకా ప్రారంభం కాని 8 పంచాయతీలు
- రెండు రోజుల్లో పూర్తి చేయడానికి ప్రణాళికలు


సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో అంజద్‌పాషా

కెరమెరి: ప్రజలకు శుద్ధజలం అందించేందుకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకంపై మండలంలోని వివిధ గ్రామాల్లో సర్వే ముమ్మరంగా సాగుతోంది. ఆయా గ్రామాల్లో ట్యాంకులు, ఇంటింటికీ నల్లాలు అమర్చారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పథకం పనితీరుపై సర్వే చేపట్టింది. ఇంటింటికీ వెళ్లి ఆరా తీస్తున్నారు. నల్లాలు, పైపులైన్‌పై సర్వే చేపడుతుంది. గ్రామ పంచాయతీల స్థాయిల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని ప్రభుత్వ దృష్టికి ఫిర్యాదులు వెళ్లాయి. కొన్ని ప్రాంతాల్లో ఎక్కువ, మరికొన్ని ప్రాంతాల్లో తక్కువ నీరు రావడం వంటి సమస్యలు అధికారుల దృష్టికి రావడంతో సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఇప్పటికే 75 శాతం పూర్తి

మండలంలో 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటిలో 121 గ్రామాలు ఉన్నాయి. 6640 కుటుంబాలు ఉన్నాయి. వాటిలో బుధవారం వరకు 5145 కుటుంబాల సర్వే పూర్తయ్యింది. ఈ సర్వేలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు 27మందితో పాటు 10 మంది సీసీలు, ఐదుగురు అంగన్‌వాడీలు సర్వేలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు సర్వే కొనసాగుతుంది. నెట్‌వర్క్ లేని కారణంగా జోడేఘాట్, బాబేఝరి, ఆగర్‌వాడ, నిసాని, భోలాపటార్, తుమ్మగూడ, బోరిలాల్‌గూడ, ముకదంగూడ అంతాపూర్ గ్రామ పంచాయతీలలో ఇంకా ప్రారంభం కాలేదు. ఆయా పంచాయతీల్లో 24 గ్రామాలు ఉన్నాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శులే సర్వే నిర్వహించాల్సి ఉన్నప్పటికీ కుటుంబాలు అధికంగా ఉండడంతో సీసీలకు బాధ్యతలు అప్పగించారు. ఈ నెల 12న సర్వే ప్రారంభమై 22న పూర్తి కావాల్సి ఉంది. గ్రామస్థాయిలో సిబ్బంది సర్వేను ముమ్మరంగా చేపడుతున్నారు.

సమాచారమంతా యాప్‌లో..

ప్రత్యేక మొబైల్ యాప్‌లో సర్వే సమాచారం అప్‌లోడ్ చేస్తున్నారు. ఇంటి యజమాని, కుటుంబ సభ్యుల వివరాలు, ఫోన్, ఆధార్ నెంబర్లు, యజమానితో ఉన్న ఇంటిఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. సర్వే సిబ్బంది సేకరించిన సమాచారాన్ని మండలాలకు అక్కడి నుంచి జిల్లాకు చేరేలా ప్రణాళికలు రూపొందించారు. చాలా చోట్ల నీరు రావడం లేదని, వచ్చిన నీరు నాణ్యతగా ఉండడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు, ప్రధాన గ్రామాల్లో భగీరథ నీటిని తాగడం లేదని తెలుస్తోంది.

వందశాతం పూర్తి చేస్తాం



ఇప్పటికే మండలంలో 75 శాతం సర్వే పూర్తయ్యింది. మరో రెండో రోజుల్లో వంద శాతం పూర్తి చేస్తాం. ఉదయం నుంచి సాయంకాలం వరకు సిబ్బంది సర్వే చేస్తున్నారు. నెట్‌వర్క్ లేని గ్రామాల్లో సైతం సమాచారం సేకరిస్తున్నాం.

– ఎండీ అంజద్‌పాషా, ఎంపీడీవో

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం


ధన్‌రాజ్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, గ్రామస్తులు

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని చిర్రకుంట ప్రాథమికోన్నత పాఠశాల నుంచి బదిలీపై జిల్లా కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల (బాలుర)కు వెళ్తున్న ప్రధానోపాధ్యాయుడు ఇస్లావత్ ధన్‌రాజ్‌ను బుధవారం ఎంపీపీ అరిగెల మల్లిఖార్జున్ ఆధ్వర్యంలో గ్రామస్తులు, సిబ్బంది సన్మానించారు. కాంప్లెక్స్ హెచ్ఎం సుభాష్, సిబ్బంది రమేశ్, జలపతిరావు, వెంకట్రావ్, మల్లేశం, అనుప్రియ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దహెగాం: సుల్తాన్‌బాద్‌లో అత్యాచారం, హత్యకు గురైన చిన్నారి కుటుంబ సభ్యులను బుధవారం ఎమ్మెల్సీ దండె విఠల్ పరామర్శించారు. చిన్నారి చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయన్నారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. నాయకులు లెండుగురే శ్యాంరావు, రాజ్‌కుమార్, బిట్టి శ్రీనివాస్, డబ్బుల జనార్దన్, ఎల్కరి ప్రశాంత్, శాకీర్, గులాబ్, మహేందర్, సాయి, ఉదయ్, నాగుల లక్ష్మీ, వెంకన్న, నారాయణ తదితరులు ఉన్నారు.

అగర్‌గూడలో..

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ గ్రామానికి చెందిన ఎల్ములే బాపు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను బుధవారం ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట నాయకులు బిట్టి శ్రీనివాస్, శంకర్‌గౌడ్, కృష్ణ, రాజు, రాజ్‌కుమార్, నగేష్ తదితరులు ఉన్నారు.

బాగా చదివి ఉన్నతంగా ఎదగాలి

కెరమెరి: కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని హైదరాబాద్‌కు చెందిన ఎస్‌పీఎస్ ఇంటెర్‌కెమ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్ టీకే సుధీర్ అన్నారు. బుధవారం మండలంలోని సావర్‌ఖెడా ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. 5వ తరగతిలో 1, 2, 3, ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. సాయినీతికి రూ. 5 వేలు, అభిరామ్‌కు రూ.3వేలు, రఘువీర్‌కు రూ. 2వేల నగదు అందజేశారు. జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఎంఎన్‌వో ప్రకాశ్, సినీ గేయ రచయిత చంద్రమౌళి, గ్రామ పటేల్ మెండి, హెచ్ఎం రంగయ్య ఉన్నారు.

కొనసాగిన ఉపాధిహామీ ప్రజావేదిక

లింగాపూర్: జాతీయ ఉపాధిహా మీలో భా గంగా 2023 –2024 సంవత్సరంలో చేసిన రూ. 3,11,46,542ల పనులపై చేసిన తనిఖీ లకు సంబంధించి ప్రజావేదిక నిర్వహించారు. వారం రోజులుగా సోషల్ ఆడిట్ బృందం పర్యటించి వివరాలు సేకరించింది. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ సమావేశంలో 14 గ్రామపంచాయతీల వారీగా నివేదికలు సమర్పించారు. పనుల్లో అవకతవకలు చోటు చేసుకున్నట్లు తెలిపారు. పూర్తి సమాచారం త్వరలో వెల్లడిస్తామన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు

జైనూర్: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. జైనూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.